ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ధరలు దిగవు.. పనులు దొరకవు

- ప్రభుత్వాల విధానాలతో ప్రజలకు కష్టాలు
- సిపిఎం ధర్నాల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-తాడేపల్లి, సత్తెనపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, ఇతర నిత్యావసరా ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రెండు జిల్లాల్లోనూ సిపిఎం శ్రేణులు నిర్వహించిన ప్రజాపోరు ప్రచార యాత్ర ముగిసిన నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం ధర్నాలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలిచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లి ధర్నాలో పాశం రామారావు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి ధర్నాలో గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. తాడేపల్లిలో ధర్నాకు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సత్తెనపల్లిలో ధర్నాకు సిపిఎం నాయకులు కె.శివదుర్గారావు అధ్యక్షత వహించారు. రామారావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధర పెంపు వల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలపై కూడా భారం పడుతుందని చెప్పారు. దిగుమతి చేసుకుంటున్నా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన, పెట్రోల్ ధరలు తగ్గించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం ధరలు పెంచుకుంటూ పోతుంటే, మరోవైపు ఏటేటా నిరుద్యోగం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం, ఉద్యోగాల కల్పనలో వెనకబడిందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి, డిగ్రీ చేతిలో పట్టుకొని ఉన్న నైపుణ్యంలో లేని పనులకు వెళు తున్న యువకులు కోట్ల మంది దేశంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు సరైన పనులు లేక, ఉపాధి దొరకక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కలకత్తాలో ఆర్జీకర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ పై హత్యాచారం మొదలుకొని దేశం, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మహిళలు, ముక్కుపచ్చలారని బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, వీటిని నివారణంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ పూర్తిగా అమలులోకి రాలేదని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల పోరాటాల వల్లే, ఎర్రజెండా అండతో 22 వేల మందికి ఇళ్ల స్థలాలు దక్కాయని, వారికి పట్టాలిస్తామని ఎన్నికలప్పుడు లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రాజధానిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, వారందరికీ పక్కాగా వేరే చోట ఇళ్ల స్థలాలిచ్చి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కలగజేసుకుని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరలు దక్కక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డుల్లో కాకుండా ప్రైవేటు ప్రైవేట్ కాటన్ మిల్లులో ప్రారంభించడం వల్ల నిజమైన రైతులకు అన్యాయం జరుగుతుందని

▶ 2లో



తాడేపల్లి, సత్తెనపల్లిలో ధర్నాలు

అపార్ అవస్థలు

- ఆధార్, స్కూల్ రికార్డుల్లో తప్పులతో నమోదు సమస్యలు
- పరీక్షల దగ్గర పడుతున్న వేళ అదనపు ఒత్తిడి
- ఇంటర్‌లో 32 శాతమే నమోదు

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులకు శాశ్వత నంబర్ ఇవ్వటానికి ఉద్దేశించిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు తల్లిండ్రులు, ఉపాధ్యాయులకు అవస్థలు పడుతున్నారు. ఆధార్ కార్డు, స్కూల్ రికార్డుల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలు అన్నీ సక్రమంగా ఉంటేనే నమోదు సాధ్యమవుతుంది. ఏ చిన్న తప్పు ఉన్నా నమోదు కావట్లేదు. విద్యార్థులు పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తప్పులు దొర్లాయి. ఇప్పుడు వాటిని సరిచేసుకోవటానికి తల్లిదండ్రులు పాఠశాలలు, ఆధార్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అపార్ నమోదుకుయ వచ్చే ఏడాది మార్చి వరకూ గడువు ఉన్నా ఉన్నతాధికారుల నుండి లక్ష్యం పూర్తి చేయాలని ఒత్తిడి ఎదురవుతోంది. మరోవైపు పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. డిసెంబర్ నాటికి సిలబస్‌లు పూర్తి చేసి, పరీక్షలకు సిద్ధం చేయాల్సిన తరుణంలో అపార్ చుట్టూ తిరగటం వల్ల అటు విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు కూడా బోధన, అభ్యసన ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గుంటూరు జిల్లాలో 1-12వ తరగతి వరకూ అపార్ నమోదుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 1-10వ తరగతి వరకూ 2,95,889 మంది విద్యార్థులు ఉండగా గురువారం నాటికి వారిలో 2,24,819 మందికి అపార్ ఐడిలు జనరేట్ చేయగా 75 శాతం పూర్తయ్యింది. ఇంకా 71,070 మందిని నమోదు చేయాల్సి ఉంది. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న వారందర్నీ నమోదు చేశారు. వివరాలు సక్రమంగా లేని విద్యార్థుల నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి 65,345 మందికిగాను ఇప్పటి వరకూ 21514 (32.92)శాతం మందిని నమోదు చేశారు. కాలేజీలకు ఆలస్యంగా లాగిన్లు ఇవ్వటంతో నమోదు నిదానంగా ఉంది. జిల్లా మొత్తంగా 1 నుండి 12 తరగతుల వరకూ 68.19 శాతం నమోదు జరిగింది.

ఆధార్ సమస్యలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇంటి పేరు

▶ 2లో

హత్య కేసులో ఏడుగురు అరెస్టు

నిందితుల్లో ఇద్దరు మైనర్లు - వివాహేతర సంబంధమే కారణం

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు మండలం మాచవరం ఎస్సీ కాలనీకి చెందిన నక్కల దేవరాజు హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేయగా వీరిలో ఇద్దరు మైనర్లు కావడం గమనార్హం. వివరాలను పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ జనార్ధన్‌రావు గురువారం వెల్లడించారు. పొన్నూరు మండలం ములుకుదురులో ఈ నెల 9న దేవరాజు హత్యకు గురవగా భార్య మాలతి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మాచవరంలో విద్యుత్ బిల్లులు తీసే పని చేసే దేవరాజుకు స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలిసిన ఆమె బంధువులు దేవరాజును ఎలాగైనా అంతమొందించాలని భావించారు. అందులో భాగంగా మాధవ్, మణికంఠలు మరో ఇద్దరు కలిసి దేవరాజును ఈనెల 9 తేదీన ములుకుదురులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి కంట్లో

▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సిఐ... వెనక ముసుగులో నిందితులు

ఏపీకి బిజెపి తీరని అన్యాయం

- కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల
- పెదకాకానిలో నెహ్రూ, ఇందిరా, రాజీవ్‌గాంధీ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న షర్మిల

దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ అని రాష్ట్ర పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని సెంటర్లో ఏర్పాటు చేసిన మాజీ దేశ ప్రధాన మంత్రులు, జాతీయ నాయకులు జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అమితమైన ప్రేమని, అందువల్లే వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ పథకం పేరుతో 46 లక్షల మంది పేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చారన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ మత భావాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రేమ, శాంతి దేశంలో నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి తీరని అన్యాయం చేసిందని,

▶ 2లో


శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

- స్టేక్‌హోల్డర్లతో కమిషనర్ సమావేశం
- ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఆలోచించాలన్న వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి శంకర్‌విలార్ ఆర్‌ఒబి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి వచ్చినందున వ్యాపారులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నిర్మాణం వల్ల నష్టపోయే ప్రతి ఒక్కరికీ తగిన పరిహారం అందిస్తామని చెప్పారు. ఈ మేరకు గురువారం జిఎంసి కౌన్సిల్ హాల్లో బ్రిడ్జి ప్రభావిత ప్రైవేట్ భవన యజమానులు, ప్రభుత్వ శాఖల భవనాల అధికారులతో వేర్వేరుగా

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.శ్రీనివాసులు



ఉపాధి హామీ పనుల్లో రూ.24.99 లక్షల రికవరీకి ఆదేశం : డ్వామా పీడీ

ప్రజాశక్తి - నకరికల్లు

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పీడీ మాట్లాడుతూ 2023-24వ సంవత్సరానికి గాను మండలంలో 3 లక్షల 27 వేల 533 పని దినాలకు గాను రూ.7.80 కోట్లను కలీలకు జమ చేశామన్నారు. రూ.24.99 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. కొన్ని గ్రామాల్లో పనుల నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని, పంచాయతీ తీర్మానాలు లేకుండానే గ్రామ సభలు నిర్వహించినట్లు, మాస్టర్లపై వేలిముద్రలు సంతకాలు లేకుండానే నగదు చెల్లింపులు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. చనిపోయిన వ్యక్తులు, అంగన్వాడి ఆయా, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, హోంగార్డులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు ఉపాధి పనులు చేసినట్లు నమోదు చేస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లును తొలగిస్తామన్నారు. ఉపాధి హామీ పని వద్ద కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు మూడు నెలల జీతాలు రావాలని పీడీ దృష్టికి తీసుకుళ్లగా వాటి చెలింపునకు పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపీ వి.అనురాధ, ఏపీడీ వెంకటరమణ, ఏపీఇ విజయలక్ష్మి, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ ప్రభాకర్, హౌసింగ్ డిఇ శ్రీనివాసరెడ్డి, ఏఈలు రసూల్, రాములు నాయక్, సురేష్, ఎస్ఆర్పి లోకేష్ ఏపీఓ సుందర్‌రావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దాచేపల్లి

మండలంలోని భట్రుపాలెంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను గురువారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు ప్రారంభించారు. రెండ్రోజుల పాటు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా





స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 5, 6 ,7 తేదీల్లో జరిగిన అండర్-19 బాలుర అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు వై.మధు కిషోర్, కె.శివసాకేత్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గువ్వల సుబ్రహ్మణ్య సుధీర్ గురువారం తెలిపారు. మధు కిషోర్ 50, 200 మీటర్ల బటర్‌ఫ్లై, 200 మీటర్ల మిడిల్ ఈవెంట్లో బంగారు పతకాలు సాధించగా శివసాకేత్ 50, 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో రజత పతకం, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. వీరు ఈనెల 24న గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్ల పాల్గొంటారని తెలిపారు. ఎంపికైనవారిని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్త, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఊటుకూరు వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, పీడీ వై.మధుసూదన్‌రావు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైద్యుల నిర్లక్ష్యానికి రోగి మృతి

ఆసుపత్రికి, స్కానింగ్ సెంటర్‌కు వినియోగదారుల ఫోరం రూ.30 లక్షలు వడ్డింపు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : వైద్యుల నిర్లక్ష్యం వల్ల మరణించిన గుంటూరు ఆర్టీసీ కాలనీ, గాంధీనగర్‌కు చెందిన షేక్ జానీ కుటుంబానికి వైద్యశాల, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు రూ.30.40 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి గురువారం తీర్పునిచ్చారు. షేక్.జానీ ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్రం భువనగిరికి వెళ్లి కారు సీట్లు కుట్టుకుంటూ జీవనం సాగించేవాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన 2022 నవంబర్ 9న భువనగిరిలోని నిర్మలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు వెళ్లాడు. వారు రాయల్ డయాగ్నటిక్ సెంటర్‌కు స్కానింగ్‌కు పంపించారు. స్కానింగ్ కేంద్రం ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం హాస్పిటల్ వారు 24 గంటల కడుపునొప్పి, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉన్నాయని రెండు ఆపరేషన్లు ఒకే సమయంలో చేసి, 13వ తేదీన ఇంటికి పంపించారు. అయినా జానీకి నొప్పి అధికం కావటంతో తర్వాత రోజే ఆసుపత్రికి వెళ్లాడు. మళ్లీ చికిత్స చేసి 18న ఇంటికి పంపించారు. అయినా నొప్పి తగ్గకపోవటంతో భువనగిరిలోని మానస హాస్పిటల్‌కు వెళ్లగా వారు స్కానింగ్ చేయించి, ఒకేసారి రెండు ఆపరేషన్లు చేయటం, ఇన్ఫెక్షన్ ఉన్న బ్రాంకియాటిస్‌ను పట్టించుకోకుండా గ్లాల్ బ్లాడర్‌ను తొలగించటం వల్ల సమస్య తలెత్తినట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. జానీకి స్తోమత లేకపోవటంతో గుంటూరు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో నవంబర్ 21న జాయిన్ అయ్యాడు. జిజిహెచ్‌లో చికిత్స తీసుకుంటూ 2023 జనవరి 8న చనిపోయాడు. జానీ మృతికి తొలుత వైద్యం చేసిన వారి నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ నిర్మల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, స్కానింగ్ కేంద్రానికి మృతుని భార్య లాయర్ ద్వారా నోటీసు పంపించారు. అయితే వాటికి వారు సమాధానం చెప్పకపోవటంతో గుంటూరు వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న మీదట కమిషన్ వారు వైద్య ఖర్చుల కింద రూ.30 వేలు, నష్టపరిహారం కింద రూ.30 లక్షలు, మానసిక ఒత్తిడికి గురి చేసినందుకు రూ.10 వేలు మొత్తం రూ.30.40 లక్షలు ఆరు వారాల్లోగా చెల్లించాలని తీర్పునిచ్చారు. ఫిర్యాది తరుపున న్యాయవాది రేకపల్లి నాగవంశీకృష్ణ వాదించారు.

'సోషల్ మీడియాలో విషసంస్కృతిపై జాగృతం చేయాలి'

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ లో నేడు సోషల్ మీడియాలో నెలకొని ఉన్న విషసంస్కృతిపై సిఎం చంద్రబాబు చొరవ తీసుకుని అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులతో విస్తతంగా చర్చలు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేష్ అన్నారు. గురువారం స్థానిక జనచైతన్య వేదిక హాలులో సోషల్ మీడియాలో విష సంస్కృతి అనే అంశం పై జరిగిన చర్చా గోష్టిలో రమేష్ మాట్లాడుతూ సోషల్ మీడియా దుష్ప్రభావాలపై విస్తతంగా చర్చలు జరగాలని, ప్రజలను జాగతం చేయాలని, కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకురాలు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు



ద్విచక్ర వాహనంపై వెళుతున్న అధ్యాపకురాలి చీర వాహనం చైన్ స్ప్రాకెట్‌లో చిక్కుకోవడంతో ప్రమాదానికి గురై దుర్మరణం పాలైన ఘటన మండలంలోని పేరేచర్ల-గుంటూరు రోడ్డు ఆరవ మైలు కాలనీ సమీపంలో జరిగింది. గుంటూరు సమీపంలోని నల్లపాడుకు చెందిన దాసరి సుస్మిత (55) పల్నాడు జిల్లా, మాచర్లలోని ఎస్‌కెబిఆర్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నల్లపాడు నుండి మాచర్ల వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులో కాలేజీకి వెళ్లి వస్తుంటారు. గురువారం ఉదయం కూడా మాచర్లకు వెళ్లేందుకు నల్లపాడు సెంటర్‌కు రాగా అప్పటికే బస్సు వెళ్లిపోయింది. ఆ బస్సును పేరేచర్లలో అయినా అందుకునేందుకు తన కుమారుడైన ధనుష్ శ్రీవాత్సవతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆమె చీరచెంగు బైక్‌లో చుట్టుకుపోవడం, అప్పటికే వేగంగా కదులుతున్న వాహనం ప్రమాదానికి గురవడంతో ఆమె రోడ్డుమీదే పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలిని మేడికొండూరు పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించి కేసు నమోదు చేశారు.

ధరలు దిగవు.. పనులు దొరకవు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అమలు జరపాలనుకుంటున్న జమిలి ఎన్నికలను తిరస్కరించాలని, రాష్ట్రాల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ధరలు నియంత్రణ కోల్పోయిన ప్రభుత్వాలు కేరళలో వామపక్ష ప్రభుత్వం అమలు జరుపుతున్న విధానాలు గురించి ఆలోచించాలని కోరారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి, గెలిపించిన ప్రజలపై దాడి చేయడానికి పోలీసులకు కొత్తగా శిక్షణిస్తారా అని మండిపడ్డారు. సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం తమ సమస్య పరిష్కరించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఐద్వా నాయకులు డి.శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ కరెంట్ చార్జీల రూపంలో రూ.18 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం వేయడం తగదన్నారు. ఐద్వా నాయకులు ఉష మాట్లాడుతూ ఇటీవల వరదలు వచ్చిన సుందరయ్య నగర్, మహానాడు, కృష్ణవేణి నగర్ ప్రాంత బాధితులకు నేటికీ పూర్తి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ దగ్గర నుండి జిల్లా కలెక్టర్, మండల అధికారుల వరకు అందర్నీ కలిసిన న్యాయం జరగలేదని చెప్పారు. తాడేపల్లి ధర్నాలో కె.కరుణాకర్‌రావు, ఎస్‌కె బాష, ఎల్ సత్యం, పి.రామచంద్రరావు, ప్రభాకర, గిరిజ, డివి భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్, కె.బాబురావు, యేసయ్య, వి.శాస్త్రి, పి.కృష్ణ, విజయరాజ్, బి.గోపాలరావు, బి.రామారావు పాల్గొన్నారు. సత్తెనపల్లి ధర్నాలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడగా జి.మల్లేశ్వరి, పి.మహేష్, ఎ.వీరబ్రహ్మం, ఎ.ప్రసాద్‌రావు, జె.రాజకుమార్, పి.సూర్యప్రకాశరావు, డి.పుల్లారావు, షేక్ సైదులు, జి.ఆంజనేయులు, ఎ.వెంకటనారాయణ, జి.శ్రీను, జి.రజిని, ఎం.నరసింహారావు, ఎం.జ్యోతి, బి.పానకాలు, ఐ.లింగయ్య, బి.రామారావు పాల్గొన్నారు.

అపార్ అవస్థలు

(మొదటి పేజీ తరువాయి)

తప్పులు, అసలు పేరులో స్పెల్లింగు తప్పులు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ నమోదులో తప్పులు దొర్లాయి. కానీ పాఠశాలలో చేర్చుకునేటప్పుడు తల్లిదండ్రులు చెప్పిన వివరాలను రికార్డుల్లోకి ఎక్కించారు. అవి కొందరి విద్యార్థులకు ఆధార్‌కు భిన్నంగా ఉన్నాయి. ఆధార్, స్కూల్ రికార్డులు రెండూ సరిపోలకపోవటంతో అటువంటి విద్యార్థుల నమోదు ప్రక్రియ నిలిచింది. ఆధార్‌లో తప్పులు సరిచేసుకోవటానికి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేని వారికి ఆధార్‌లో సరిచేయటానికి సాధ్యం కావట్లేదు. ఆధార్‌లో తప్పులను సరిచేయటానికి పాఠశాలల్లోనే తాత్కాలిక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. ఎక్కడెక్కడ ఆధార్ కేంద్రాలు అవసరమో సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా విద్యాశాక అధికారి సి.వి.రేణుక తెలిపారు. త్వరలో వాటిని ఏర్పాటు చేసి, ఆధార్ తప్పులను సరిచేస్తామంటున్నారు. కాగా స్కూల్ రికార్డుల్లో తప్పులను సరిచేయటానికి ప్రధానోపాధ్యాయులకు అధికారం కల్పించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల రికార్డుల్లో తప్పులు సరిచేసే అధికారం విద్యాశాఖ అధికారులకు కల్పించారు. అయితే స్కూల్ రికార్డుల్లో తప్పులు సరిచేసే క్రమంలో అక్రమాలు జరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవి భవిష్యత్‌లో విద్యార్థులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కాగా కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో అపార్ నమోదు నిదానంగా ఉందని సమాచారం.

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్, ఆర్అండ్‌బి అధికారులు సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత శంకర్ విలాస్ బ్రిడ్జి షుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించారని, పెరిగిన ట్రాఫిక్ రీత్యా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో నూతన బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిదని అన్నారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి స్థానంలో 71 అడుగుల వెడల్పుతో 4 లైన్ల బ్రిడ్జి, డివైడర్, ఫుట్ పాత్‌లతో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. హిందూ కాలేజి జంక్షన్ నుండి లాడ్జి సెంటర్ వరకు 1.6 కిలోమీటర్ల పొడవు, 120 అడుగుల వెడల్పుతో విస్తరించనున్నట్లు చెప్పారు. విస్తరణ వల్ల 19 ప్రభుత్వ, 99 ప్రైవేట్, 14 మిషనరీల, 2 ప్రార్ధనా మందిరాలు ప్రభావితం అవుతాయన్నారు. నష్టపోతున్న భవనాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకార పరిహారం అందచేస్తామన్నారు. భవన యజమానులు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ బ్రిడ్జి విస్తరణకు ముందు ట్రాఫిక్ సర్వే జరపలేదని, సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకుండా బ్రిడ్జిని విస్తరించినా ప్రయోజనం ఉండదని అన్నారు. వ్యాపారులు పెద్ద ఎత్తున నష్టపోతున్నందున రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం, డొంక రోడ్డు మూడు వంతెనల వద్ద ఉన్న ఆర్‌యుబి విస్తరణ వంటి ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని కోరారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ తాము బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకం కాదని, కానీ వ్యాపారులను కూడా దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. 120 అడుగులకు విస్తర్తిస్తే ఒక్క షాపు కూడా మిగిలదన్నారు. వ్యాపారులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా జిఎంసి ప్రకటించిన నష్ట పరిహారానికి సంతృప్తి చెందిన లాల్‌వజీర్ తన అంగీకారం తెలియజేస్తూ పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. సమావేశంలో సిటీప్లానర్ రాంబాబు, ఎసిపి అబ్దుల్ రెహ్మాన్, ఆర్అండ్‌బి డిఈఈ చిన్నయ్య, ట్రాఫిక్, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, సిపిడిసిఎల్, లేపాక్షి, జిజిహెచ్, ఉమెన్స్ కాలేజి, పోలీసు అధికారులు, బ్రాడిపేట, అరండల్‌పేట భవనాల యజమానులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఏడుగురు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

కారం చల్లి ఇనుప రాడ్లతో కొట్టారు. దీంతో దేవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిని నిర్ధారించుకున్న అనంతరం నిందితులు పరారయ్యారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం నిందితులైన మాధవ్, గౌతమ్, జోసెఫ్, మణికంఠ, రాజుతోపాటు మరో ఇద్దరు మైనర్లను పొన్నూరు శివారు జిబిసి రోడ్డు వద్ద అరెస్టు చేశారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునూ నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై కిరణ్ బాబు పాల్గొన్నారు.

ఏపీకి బిజెపి తీరని అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ఒకటే మార్గమని అన్నారు.

అభివృద్ధి పథంలో నెహ్రూ పరిపాలన : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రధానమంత్రిగా నెహ్రూ పరిపాలనలో పంచవర్ష ప్రణాళికలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారనిఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీలు, ఐఐటి, ఎన్ఐడి, ఇస్రో సంస్థలు నెలకొల్పింది కూడా నెహ్రూ అని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంస్కరణ తీసుకువచ్చి పేద ప్రజలకు న్యాయం చేశారని వివరించారు. బ్యాంకులు జాతీయకరణ చేసింది కూడా ఇందిరా గాంధీ అని తెలిపారు. నేడు బిజెపి నాయకులు నెహ్రూ, గాంధీ పేర్లను విమర్శిస్తున్నారని అన్నారు. ఎఐసిసి అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు ఎల్.ఈశ్వరరావు, జెసివి నాయకులు వి.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగిపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వంపై తప్పుడు పోస్టులను సోషల్ మీడియాలో పెట్టిన ప్రభుత్వ ఉద్యోగిపై పోలీసు ఫిర్యాదుకు టిడిపి నాయకులు సిద్ధమయ్యారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డిఇఎంగా పనిచేస్తున్న జయప్రసాద్ సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక పోస్టులు పెట్టినట్లు గుర్తించారు. దీంతో జయప్రసాద్‌పై టిడిపి నాయకులు డిఎంహెచ్ఒకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ లోనూ ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

రెవెన్యూ శాఖ బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో రెవెన్యూశాఖ సేవలు, ఫిర్యాదులు ప్రజల సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశం చారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ మినీ హాల్లో జరిగిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జెసి ఏ. భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి రెవెన్యూ అంశాలపై తహశీల్దార్లు, సర్వేయర్లు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారం, ఏపీ సేవా సర్వీసులు, ఎల్పీ ఎంలు, రీసర్వే, ల్యాండ్ కన్జర్వేషన్, భూ సేకరణ, కమిషన్‌లలో నమోదైన కేసులు తదితర అంశాలపై మండలాలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రధాన విధులైన భూ సంబంధిత, సర్టిఫికేట్ల జారీ సేవలలో జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లా రాజధాని ప్రాంతంలో ఉండటంతో భూముల విలువ ఎక్కువ ఉన్నందున ప్రభుత్వ ప్రాజక్టులకు అవసరమైన భూముల సేకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రెవెన్యూలో కొంతమంది చేస్తున్న తప్పుల వలన శాఖ మొత్తానికే చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉన్నందున తహశీల్దార్లు క్రింది స్థాయి ఉద్యోగుల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఏపీ సేవాలో రెవెన్యూ సేవలకు సంబంధించి భూసంబంధిత, ఫ్యామిలీ మెంబర్లు, పుట్టిన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల పత్రాలు పెండింగ్ లేకుండా సత్వరమే జారీ చేయాలన్నారు. రీసర్వే పూర్తైన గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. రీసర్వే సందర్భంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్ళుపై పేర్లను చెరిపివేసే పనులు డిసెంబరు నాటికి పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గతంలో వివిధ శాఖలకు భూములు కేటా యించినా ఇప్పటికీ వినియోగించని భూముల వివరాలు సేకరించి మండల స్థాయి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు కేటాయించిన భూము లపై వివరాలు అందించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, కేఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీలు అజీజ్, సీతారామయ్య, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్కేటింగ్ క్రీడాకారులకు కమిషనర్ అభినందనలు



హాశిష్, లిఖిత్‌లను అభినందిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నగర పాలక సంస్థ కార్యాలయంలో గురు వారం స్థానిక మున్సి పల్ స్కేటింగ్ పార్కులో ఈ నెల 6 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 36వ స్కేటింగ్ పోటీల్లో మెడల్స్ సాధించిన తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన హాశిష్, లిఖిత్ సోదరులను కమిషనర్ అలీమ్ భాషా అభినందించారు. మెరుగుపాల హాశిష్ 11 నుండి 14 సంవత్సరాల లోపు ఆర్టిస్టిక్ ఇన్ లైన్ ఫ్రీ స్టైల్ విభా గంలో సిల్వర్ మెడల్, సోలో డాన్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. హాశిష్ సోదరుడు మెరుగుపాల లిఖిత్ అయిదు నుండి ఏడు సంవత్సరాల లోపు ఆర్టిస్టిక్ ఫిగర్, ఫ్రీ స్టైల్, సోలో డాన్స్ విభాగాల్లో మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. హాశిష్ తమిళనాడు పొలాచిలో డిసెంబర్ 6 నుంచి 10 వరకు జరిగే 62వ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికయ్యారని గుంటూరు జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



కాట్రగడ్డ మధు వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం రాధా రంగా నగర్ కి చెందిన లక్ష్మీ అనే చిరు వ్యాపా టరికి టిఫిన్ బండిని, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు తన సొంత ఖర్చులతో టిఫిన్ బండిని అందజేశారు. అదేవిధంగా ఆటో కార్మికుడు వెంకట్రావుకి రూ.ఐదువేల సహాయం అందించారు. ఈ కార్య క్రమంలో టిడిపి వడ్డే శ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ కార్యదర్శి మద్దినేని సుబ్ర హ్మణ్యం, కాట్ర గడ్డ లక్ష్మణ రావు, కాట్రగడ్డ లక్ష్మి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



మధుమేహంపై సెయింట్ ఆన్స్‌లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు : గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో మైక్రో బయాలజీ విభాగం వారు ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించారు. డిగ్రీ విద్యార్థినులు మధు మేహం వ్యాధి లక్షణాలు, నియంత్రణ చర్యలు, లఘు నాటకం ద్వారా కళాశాలలో అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, బి.రంజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి 'బి' సర్టిఫికెట్ పరీక్షల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉత్తీర్ణత...

10వ ఆంధ్రా గరల్స్ బెటాలి యన్ ఫిబ్రవరి 2024లో నిర్వహించిన బి సర్టిఫికెట్ పరీక్షలో సెయింట్ ఆన్ విద్యార్థులు 18 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సంధ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంధ్య, ఎన్‌సిసి అధికారులు కె.సుస్మిత ఎన్‌సిసి క్యాడెట్లను అభినందించారు.



ఆదినారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్, గద్దె చలమయ్య తదితరులు... ఇన్‌సెట్‌లో ఆదినారాయణ (ఫైల్)

సిపిఎం నాయకులు, ఆర్‌ఎంపి డాక్టర్ మామిడి ఆదినారాయణ మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన సిపిఎం నాయకులు, ఆర్‌ఎంపీ డాక్టర్ మామిడి ఆదినారాయణ (75) గుండెపోటుతో గురువారం హఠాన్మరణానికి గురయ్యారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన మామిడి ఆదినారాయణ 55 ఏళ్ల నుండి రైల్వే స్టేషన్, సుగాలి కాలనీ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పేదలకు వైద్యం అందిస్తున్నారు. తల్లిదండ్రులు మామిడి భద్రయ్య, సౌభాగ్యమ్మల కాలం నుండే వారి కుటుంబం సిపిఎం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ నిర్మాణానికి దోహదపడ్డారు. ఆదినారాయణ తన చిన్నతనంలో పట్టణంలోని హనిమిరెడ్డి మెడికల్ షాపులో గుమస్తాగా పని చేసి అనంతరం ఆర్‌ఎంపీ డాక్టర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. యువజన సంఘంలో పనిచేస్తూ తల్లిదండ్రుల వారసత్వంగా సిపిఎం రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదినారాయణ మరణ వార్త తెలుసుకున్న సిపిఎం శ్రేణులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు ఎ.వీరబ్రహ్మం, ఎం.జగన్నాథరావు, ఎ.ప్రసాద్‌రావు, జి.మల్లేశ్వరి, జి.రజని, ఎం.జ్యోతి, జి.బాలకృష్ణ, పి.ప్రభాకర్, బి.నాగేశ్వరరావు, ఎ.వెంకటనారాయణ, జె.రాజకుమార్, ఎం.తాతారావు ఉన్నారు.



25 నుండి సమ్మె చేస్తాం

ప్రజాశక్తి - నకరికల్లు : తమ సమస్యలను పరిష్కరించాలని 108 అంబులెన్స్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కె.పుల్లారావు, ఎంపిడిఒ కాశయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. వాహన పైలెట్ వెంకటేశ్వర్లు, ఈఎంపిటి బాబురావు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో ఉద్యోగస్తులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఉద్యోగస్తులు సహజ మరణం పొందితే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఈ అంశాలపై 25వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడి కేంద్రంలో ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణంలోని 17వ వార్డు అంగన్‌వాడి కేంద్రంలో గురువారం ఆధార్ క్యాంప్ నిర్వహించారు. టీచర్ కెవి రుక్మిణి ఆధ్వర్యంలో నిర్వహకులు శ్రీమన్నారాయణ పాల్గొని ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ తీస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కు ఫోన్ నంబర్‌ను లింక్ చేస్తామని, ఇళ్లకు వచ్చికూడా సర్వీస్ చేస్తామని చెప్పారు.





ధర్నా చేసి.. సమస్యలు విన్నవించి..

పలు సమస్యలతో సతమతమవుతున్న ప్రజలపై భారాలు తగ్గించాలని, జీవనోపాధి కల్పించడంతోపాటు నిత్యాసర ధరలు తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ శ్రేణులు గురువారం పల్నాడు జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాయి. సిపిఎం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ప్రజాపోరా ప్రచార ముగింపు సందర్భంగా చేపట్టిన ధర్నాల అనంతరం తహశీల్దార్లు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం తహశీల్దార్ కె.వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం కమిటీ సభ్యులు డి.శివకుమారి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించాలని, స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పప్పులు, బియ్యం, వంటనూనె, పెట్రోల్, డీజిల్ వంటి ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించకపోగా విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరిట అదనపు భారాలు వేయడం దారుణమని అన్నారు. రేషన్ డిపోల ద్వారా 18 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు టి.పెద్దిరాజు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా, అక్కడి కార్మికులు, ఉద్యోగులు 1500 రోజులుగా ఉద్యమిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పంటకు మద్దతు ధర ఇవ్వాలని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేసి పాత కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. నాయకులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, ఇ.మస్తాన్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలి, గాంధీ స్మారక సమితి నాయకులు ఈదర గోపిచంద్, ఖాసీం పాల్గొన్నారు. రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర రాజు మాట్లాడారు. సీనియర్ నాయకులు కె.రామారావు, ఎ.ఫణీంద్ర, జి.అంజిరెడ్డి, ఐ.కోటేశ్వరరావు, బి.బాలకోటయ్య, పి.రామిరెడ్డి, యాకోబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక తహశీల్ధార్ కార్యాలయం వద్ద నిరసనలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదరిక్శవర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని మండిపడ్డారు. ఇసుక సమస్య వలన భవన నిర్మాణ రంగ కార్మికులకు సరైన ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్ధార్ కార్యాలయ ఉద్యోగి రంగారావుకు వినతిపత్రాన్ని అందించారు. కాంట్రాక్ట్, ఆవుట్ సోర్సింగ్ కార్మికులను వేధించవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.మహేష్, వై.సురేష్, శోభన్‌కుమార్, జ్యోతిష్, రాజు, బి.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి తిక్క నాగేశ్వరరావు కోరారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం డిప్యూటీ తాసిల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రమిచ్చారు. బి.మహేష్, ఆంజనేయ నాయక్, ఎం.ప్రకాష్‌రావు, మరియదాసు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - అమరావతి


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం.... వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, అమరావతి కార్యదర్శి డి.సూరి బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో రూ.6 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేస్తోందన్నారు. కేంద్ర చెబుతున్న జమిలి ఎన్నికలు రాష్ట్రాలకు నష్టమన్నారు. ఉచిత ఇసుక సరఫరాలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అమరావతి ప్రాంతంలో భారీ వాహనాలతో అర్ధరాత్రి సమయాల్లో అధికార నాయకులు అండతో ఇసుకను దోచుకుంటున్నారని విమర్శించారు. మరోవైపు వేలాది మందికి భవన నిర్మాణ కార్మికులకి ఉపాధి లేక అల్లాడుతున్నారని చెప్పారు. ఎస్‌డి మోదిన్‌వలి, వెంకటేశ్వరరాజు, పౌలు, కొండలు, మురహరి, టి.సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం శ్రేణులు ధర్నా చేశాయి. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం మండల కన్వీనర్ జరుగుల శంకరరావు, నాయకులు కె.రోశయ్య, ఎన్.తులశయ్య, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేసిన తహశీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. పట్టణ, రూరల్ గ్రామాల్లో సమస్యలను వివరించారు. సుందరయ్య కాలనీ, వెన్నపూస వాగు కాలనీ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని, మిద్దెబావి, మాస్టింగ్ కాలనీతో పాటు, విఠంరాజుపల్లి, వీరపనేనినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు క్లెయిములను పరిష్కరించాలని, ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలు అరికట్టి సామాన్యులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినుకొండ నుండి నాగులవరం కారంపూడి రెండు వరుసల రోడ్డుతో పాటు, తిమ్మాయపాలెం నడిగడ్డ దొండపాడు గ్రామాలకు రోడ్లు వేసి, గ్రామాల్లో ఉన్న కుక్కలు కోతులు బెడదను



నివారించాలన్నారు. పట్టణ తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలకు పెంచి రోగులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు, మందులు అందించాలని, 24 గంటలు వైద్యులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు హనుమంత్‌రెడ్డి, కె.శివరామకృష్ణ, రంజాన్ బీ, పి.వెంకటేశ్వర్లు, మునివెంకటేశ్వర్లు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం మండల కన్వీనర్ చిన్నం పుల్లారావు, కె.దుర్గారావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. 12వ వార్డులో చర్చిపక్క ఉన్న డ్రెయినేజీ కాల్వనీరు పెద్ద కాల్వలలో కలిపేలా చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీలో ఉన్న స్థలంలో పార్కు నిర్మించాలని, జూనియర్ కాలేజీ పక్కన, చంద్రమౌళి పార్క్ వెనక వైపు, శ్మశాన వాటిక వెనుక బజారు కలుపుతు రోడ్డు వేసి లైట్లు, సైడు కాల్వలు నిర్మించాలని డిమాండ్ చేశారు. తాగునీటిని పైపులు ద్వారానే ప్రతి ఇంటికీ ఇవ్వాలని కోరారు. 17వ వార్డులో ప్రగతి స్కూల్ ఎదురుగా ఉన్న ముళ్ల కంపలో విషసర్పాలున్నాయని, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని కోరారు. రాచుమల్ల నగర్లో ప్రభుత్వాస్పత్రి పక్కన రోడ్లు, సైడు కాల్వలు నిర్మించాలన్నారు. విద్యుత్ లైట్లు వేయాలని, అంకమ్మచెట్టు వద్ద బాయివద్ద బోరింగును బాగు చేయించాలన్నారు. యడవల్లి సొసైటీ భూమి సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఎస్.లూథర్, ఎస్.బాబు, పి.శివపార్వతి, కె.శివయ్య, టి.ప్రతాపరెడ్డి, టి.సుబ్బారెడ్డి, పి.లెనిన్, పి.భారతి, ఎం.చినరామయ్య, కట్టుబడివారిపాలెం మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి నకరికల్లు

ధర్నా అనంతరం తహశీల్దార్ కె.పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కన్వీనర్ జి.పిచ్చారావు, ఇ.అప్పిరెడ్డి, లక్ష్మారెడ్డి, కొండ నాయక్, రామంజి నాయక్, బి.దుర్గాభాయ్, అంజలి భాయ్, కుమారి, వీరయ్య, ఎస్.బాలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

తహశీల్దార్ కార్యాలయం వద్దకు సిపిఎం శ్రేణులు ప్రదర్శన చేశాయి. అనంతరం ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ, నాయకులు టి.అమరలింగేశ్వరరావు మాట్లాడారు. ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ ఆపేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. తహశీల్దార్ భవానిశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జి.జాలయ్య, పి.సైదాఖాన్, ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, డి.చిన్నారావు, కె.ప్రభాకర్, టి.మస్తాన్‌రావు, ఎం.నాగేశ్వరావు, డి.అప్పారావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.











సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ధర్నా

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్ మాట్లాడుతూ అన్నారు. ప్రజా పోరు ప్రచార కార్యక్రమంలో భాగంగా సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేసి, అనంతరం కమిషనర్ ఎస్ ఆలీ భాషకు వినతి పత్రం అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయం గేటు వద్ద జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో అనేక సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల లోని భూముల్లో పేదలు ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్నారని వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలం లేని నిరుపేదలు పట్నంలో 6000 మంది ఉన్నారని వారికి ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్నంలో రోడ్లు పగలగొట్టి ఉన్నాయని వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ భూముల్లో ఇల్లు చేసుకొని ఉంటున్న పేదలకు డి ఫారెస్ట్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా అనేక ప్రాంతాల్లో పేద ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కేంద్రం లోని మోడీ ప్రభుత్వం నిత్యవసర వస్తువుల సరుకుల ధరలను రోజురోజుకు పెరుగు తున్న ప్పటికీ నియంత్రణ లేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు వేయడానికి సిద్ధపడుతుందని వాటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, ఎం పకీరయ్య, పట్టణ కార్యదర్శి వరకు సభ్యులు ఎం బాలాజీ, పట్టణ నాయకులు ఎం చలపతిరావు, జే బ్రాహ్మణి, వివిధ ప్రజా సంఘాల నాయకులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, ఈ కాటమరాజు, కే బుజ్జి బాబు, జి శ్రీనివాసరావు, మీరాబాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తుళ్లూరు : రాజధాని అమరావతి ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాజధాని డివిజన్ కమిటి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం రాజధాని డివిజన్ కమిటి అధ్యక్ష, కార్యదర్శి ఎం భాగ్యరాజు,ఎం రవి, నేతత్వంలో నవంబర్ 8 వ తేదీనుంచి రాజధాని గ్రామాల్లో ప్రజాపోరు ప్రచార యాత్ర జరిగింది.ప్రజాపోరులో రాజధాని ప్రాంత ప్రజల నుంచి వచ్చిన సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది.ఈ సందర్భంగా రవి,భాగ్యరాజు మాట్లాడుతూ,రాజధాని అమరావతి నిర్మాణంపై అనిశ్చితి లేకుండా చట్టబద్ధత కల్పించాలని సిపిఎం కోరుతోందని అన్నారు.రాజధాని నిర్మాణానికి రూ 15 వేల కోట్లు అప్పుగా కాకుండా కేంద్రమే గ్రాంటు గా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. రాజధాని రైతులకు,అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలు తక్షణమే చెల్లించాలని కోరారు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని,అసెంబ్లీ, సచివాలయం,హైకోర్టు లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు రూ 21 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు,పేరం బాబురావు,షేక్ జానీ,కె రామకృష్ణ, కుంభా వెంకటేశ్వర్లు, నానయ్య, కైలా స్టాలిన్, పి కపారావు,కుంభా ఆంజనేయులు,పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురం ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించి డిప్యూటీ తాసిల్దారు గారికి అర్జీ ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి, మండల నాయకులు మార్పుల వెంగల్ రెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, గుంటుపల్లి వెంకటేశ్వర రావు సిహెచ్ సాంబశివరావు అంకమ్మరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : చెంచు కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ మండల నాయకులు ఉప తాహసిల్దార్ నిర్మల కృష్ణకు గురువారం వినతిపత్రం అందించారు.అనంతరం సిపిఎం పార్టీ తాడికొండ శాఖ నాయకులు చింతల భాస్కర్ రావు మాట్లాడుతూ చంచ కాలనీ ఏర్పడి సుమారు 40 సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు సరైన సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గ్రామంలో కనీసం మూడు రోజులకు ఒకసారి అయినా మంచినీటి సరఫరా చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇమ్మడి రామారావు ముక్కెర శ్రీరాములు భద్రయ్య జోజి శ్రీనివాసరావు షేక్ మహబూబ్ సుభాని జొన్నల కోటిరెడ్డి, బహుజన్ సమాజ్‌వాది పార్టీ నాయకులు బాబురావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కాజా గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆయా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు చార్జీలు పెంచమని చెప్పిన ప్రభుత్వం నేడు అందుకు భిన్నంగా వ్యవహరించిందన్నారు. ప్రజలపై 6000 కోట్ల రూపాయల భారాన్ని మోపారని చెప్పారు. వచ్చే నెలలో 11వేల280 కోట్ల రూపాయలను పెంచేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వెంటనే విద్యుత్ ట్రూ అప్ చార్జీలను సర్చార్జిల పేరుతో వేసే భారాలను ఉపసంహరించుకోవాలని కోరారు. గ్రామంలో పుల్లయ్య నగర్ సుందరయ్య నగర్ లలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి కోటేశ్వరి, సింహాద్రి సుమ, ఎం అరుణ, గాదే మాధవరెడ్డి, సింహాద్రి రామిరెడ్డి, బి సత్యమారెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలం వద్ద ధర్నా జరిగింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య శాఖ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు పండల ప్రసాద్ సాంబశివరావు అజయ్ శేషయ్య శర్మ గిరి జనార్ధనరావు సీతారామాంజనేయులు బాబ్జి కృష్ణ సురేష్ శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ప్రజాపోరు ప్రచారం లో భాగంగా చేబ్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఆదిశేషు, నాయకులు పీ చౌడయ్య, గుర్రం శ్రీనివాసరావు, ఎస్.కె మస్తాన్ వలి పాల్గొన్నారు.



మంగళగిరిలో


ఆత్మకూరులో



తుళ్లూరులో


కాజలో


చేబ్రోలులో


ఫిరంగిపురంలో


తాడికొండలో

నిబంధనల మేరకు ఓటరు దరఖాస్తులు పరిశీలించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల పరిశీలన ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి జరగాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ కోరారు. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు గురువారం డిఆర్ఒ ఎన్.ఎస్‌కె.ఖాజావలికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెగ్యులర్‌గానీ, డైరెక్టర్‌గానీ డిగ్రీ చేసిన అర్హులని నిబంధనలు తెలియజేస్తుంటే వెరిఫికేషన్ సిబ్బంది టెన్త్, ఇంటర్, డిగ్రీ మూడు ఉండాలని, లేనిచో తిరస్కరిస్తామని చెబుతున్నారన్నారు. డిఆర్ఒ స్పందిస్తూ ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పొందినా చెల్లుబాటు అవుతుందన్నారు. దీనికి భిన్నంగా వ్యవహరించే వారిపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటా మన్నారు. అదే విధంగా డిగ్రీతోపాటు, ఇతర విద్యార్హత సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. డిఆర్ఓను కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ యం.హనుమంత రావు, నాయకుల జి.వెంకటేశ్వర్లు, శివపార్వతి, వెంకటేశ్వరరావు, గోవిందయ్య, చిన్నయ, షకీలాబేగం పాల్గొన్నారు.


డిఆర్ఓకు వినతిపత్రం ఇచ్చిన యుటిఎఫ్ నాయకులు



నిర్మల హైస్కూల్లో రేపటి నుండి సాహిత్య, లలిత కళల మహోత్సవాలు

నాలుగు రాష్ట్రాల నుండి విద్యార్థులు రాక - ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల హై స్కూల్ నందు సి ఎస్ ఏ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీలలో 14వ విద్యాపరమైన సాహిత్యం, లలిత కళల పోటీలను నిర్వహిస్తున్నట్లు హైస్కూల్ కరస్పాండెంట్ రెవ సిస్టర్ జాన్ పాల్, హై స్కూల్ ప్రిన్సిపాల్ రెవ సిస్టర్ జ్ఞాన సుందరి గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 28 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సిఎస్ఏ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఇమాక్యులేట్ మేరీ ప్రామిస్ లో ఉన్న పాఠశాలలలో ఈ ఉత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. మార్కులు, ర్యాంకులు అంటూ పాఠ్యాంశాలను కంఠస్థం చేయిస్తూ్తన్న నేటి కాలంలో అందుకు ప్రత్యామ్నాయంగా విద్యార్థుల్లో ప్రతిభను సృజనాత్మకతను పెంపొందించేందుకు, ఔత్సాహిక ఆవిష్కరణలకు వేదిక వలె వారిలో శక్తిసామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా సి ఎస్ ఏ సంస్థ ఈ ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లలిత కళల పోటీలలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ 3 భాషల్లో విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. సాహిత్యంలో భాగంగా ఇచ్చిన అంశంపై ఉపన్యాస కార్యక్రమం, ఒక అంశాన్ని విని రాయటం, తార్కికంగా ఆలోచించడం, క్విజ్, పద సమీకరణ వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. అదేవిధంగా లలిత కళలలో భాగంగా మట్టితో విగ్రహాలను తయారు చేసే క్లే మోడలింగ్, రంగు రంగుల ప్రక్రియలు, కాగితాలతో కార్డుల తయారీ, వ్యర్ధ పదార్థాల నుండి వస్తువులను తయారు చేయడం, పెన్సిల్ తో బొమ్మలు వేయుట వంటి అనేక రకాల అంశాలలో విద్యార్థుల సజనాత్మకతను పెంపొందించేందుకు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు.


పుస్తకాలను తిలకిస్తున్న కమిషనర్, ముప్పాళ్ల, జంగాల

పుస్తక పఠనంతో ప్రశాంత జీవనం

ప్రజాశక్తి-గుంటూరు

మనిషి ప్రశాంత జీవితానికి పుస్తక పఠనం దోహదపడుతుందని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. విశాలాంధ్ర బుక్‌హౌస్ వారి 24వ పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక ఏ.ఎల్.బిఇడి కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కమిషనర్ ప్రారంభించారు. అనంతరం పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలని, 40 రకాల పబ్లిషర్స్ ప్రచురించిన వేలాది పుస్తకాలు ఈ ప్రదర్శనలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ బి.శ్రీనివాసులు, సిపిఐ నగర కార్యదర్శి మాల్యాద్రి పాల్గొన్నారు.

ఆటపాటలతో ఉత్సాహంగా బాలల దినోత్సవం



ప్రజాశక్తి - మాచర్ల :

బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో గురువారం వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మాచర్ల పట్టణంలోని ఓక్ విద్యా సంస్థలో రోటరి క్లబ్ వైస్ గవర్నర్ రామకోటయ్య, వైసిపి సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొని మాట్లాడుతూ. నేటి బాలలే రేపటి దేశానికి శక్తి స్వరూపాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ షేక్ దరియావలి, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీలక్ష్మి, డీన్ రాజేశ్వరి పాల్గొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో చెన్నకేశవనగర్ కాలనీలో ఎంపిపి స్కూల్‌లో విద్యార్థులకు న్యాయవాదులు గంగుల శ్రీనివాసరావు, వై.శ్రీహరి, షేక్ ఖాసిమ్, హెచ్ఎం ఆర్.మరియమ్మ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.



ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం ఎత్తిపోతలలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని హెచ్ఎం దుర్గాభవాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా నాగార్జున సాగర్ ఫ్లైటెక్ ఏవియేషన్ ఎమ్‌డీ కెప్టెన్ మమత పాల్గొన్నారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కెప్టెన్ మమత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రతి ఏటా పాఠశాలలో 10 వ తరగతి లో టాపర్ గా నిలిచిన విద్యార్థినికి ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థినులు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఎంసి చైర్మన్ కె.అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెన్నుపూస కాలనీలోని గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్స్ వేడుకల్లో ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి మాట్లాడారు. దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూకు బాలలు ఎంతో ఇష్టమని, ఆయన పుట్టిన రోజునే బాలల దినోత్సవంగా



నిర్వహించుకుంటున్నామని వివరించారు. బాలలంతా ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలన్నారు. అనంతరం చిన్నారులు వివిధ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలరించారు. గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో వేడుకల్లో చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ పతాకాన్ని హెచ్ఎం ఎం.బాలసౌరయ్య ఎగురవేసి వేడుకలు ప్రారంభించారు. కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో అలరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని తహశీల్దార్ దానియేలు, ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తో పాటు విజయ విద్యా విహార్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పెదకూరపాడు జెడ్‌పి పాఠశాలలో, విజయ విద్యా విహార్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెక్రెటరీ–కస్పాండెంట్ శ్రీకాంత్ హెచ్ఎం కోటేశ్వరావు, శ్రీదేవి, వాసు, పవన్, రామాంజనేయులు, నాగరాజు, బాబురావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక జై భారత్ స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల డైరెక్టర్ తిప్పిరెడ్డి జైనేంద్రరెడ్డి సందేశమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



ప్రజాశక్తి - యడ్లపాడు

మైదవోలు బీసీ కాలనీలోని పాఠశాలలో విద్యార్థులకు స్కిప్పింగ్, రన్నింగ్, గన్ని బ్యాగ్స్ జంపింగ్, త్రో బాల్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం జీవీ.హేమలత, ఎన్.కోటేశ్వరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - రెంటచింతల

పలు పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.



ప్రజాశక్తి–చిలకలూరిపేట

స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం పి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్లో భాగంగా వివిధ వేషధారణలో చిన్నారులు అలరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్, విశ్రాంత ఎంఇఒ జాన్‌సుందర్‌రావు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారామ్, రిటైర్డ్ హెచ్ఎం రవికుమార్, ఇంచార్జ్ గ్రంథాలయ అధికారి భూక్య బద్రి నాయక్ మాట్లాడారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నూతన గ్రంథాలయ స్థల సేకరణకు సహకరిస్తామని కమిషనర్ చెప్పారు. రోటరీ క్లబ్ వాళ్లకు ఇచ్చే స్థల సేకరణలో ఒక భాగంగా గ్రంథాలయం నిర్మించడానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రజాశక్తి–చిలకలూరిపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉత్సవాలను కౌన్సిలర్ కొత్త కుమారి ప్రారంభించారు. సీనియర్ విభాగంలో విద్యార్థులకు దేశభక్తి గేయాలు, శతక పద్యాలు పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో ఫ్యాన్సీడ్రస్ పోటీలు పెట్టారు. విజేతలకు జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ సొసైటీ (గార్డ్స్) సంస్థ పుస్తకాలను బహూకరించింది. గ్రంథాలయాధికారి ఎం.నాగుల్ మీరావలి అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడారు. తొలుత జవహర్లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గార్డ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ సలహాదారులు, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు చిట్టిబాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, తుర్లపాడు మాజీ సర్పంచ్ వి.చంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి–ఈపూరు : గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తాయని ఎంపీడీవో కె.ప్రభాకరరావు అన్నారు. ఈపూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించి తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలేశారు. అనంతరం గ్రంథాలయాల



ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. ఎ.ముప్పాళ్ళ శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రాథమిక పాఠశాల హెచ్ఎంనాగరాజు ప్రారంభించారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారులు జి.శ్రీనివాసరావు, ఎస్.నాగలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, వెంకట నరసయ్య, యు.పాపారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–సత్తెనపల్లి : స్థానిక గ్రంథాలయంలో కార్యక్రమానికి ఈఒపిఆర్‌డి శ్రీనివాస్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిధుగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.





జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం సందర్శించారు. గిరిజన హక్కులకోసం, వారి భూముల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా నవంబర్ 15న జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా చెంచు గూడేలలో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక ఆర్థిక, అభివృద్ధి కోసం తలపెట్టిన జనజాతి ఆదివాసి న్యాయ మహా అభయాన్ పథకం తొలి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. పాఠశాలలో తొలి వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట డిటిడబ్ల్యూ వరలక్ష్మీ ఉన్నారు.

దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకులు ప్రకాష్‌రాజు మృతి



ప్రజాశక్తి- మాచర్ల : పట్టణంలోని సూర్యకిరణ్ దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకులు విద్యాధరణి ప్రకాష్‌రాజు(73) గురువారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం మాచర్ల పట్టణంలో దివ్యాంగుల పాఠశాల స్థాపించి దివ్యాంగులకు ఆసరాగా నిలబడ్డారు. ఆయన సేవలు మరవలేనివని, వెనుకబడ్డ పల్నాడులో దివ్యాంగుల పాఠశాల స్థాపించి వారికి ఎంతో మేలు చేశారని పలువురు నివాళులు అర్పించారు. ఎన్నో వైద్యశిబిరాలు నిర్వహించి, వికలాంగుకు అవసరమైన వైద్య, విద్య అందేందుకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి–ఈపూరు : నరసరావుపేటలోని కృష్ణవేణి కళాశాలలో జరిగిన అంతర కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని కె.శాంతకుమారి ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. ఈనెల 29 నుండి తమిళనాడు రాష్ట్రంలో అలగప్పా యూనివర్సిటీ కరైకుడిలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టుకు శాంతకుమారి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, ఎం.దాసు, కె.వంశీ అభినందించారు.

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళ కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థిని కె.ఆదిలక్ష్మి ప్రతిభ చాటి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ గురువారం తెలిపారు. ఆదిలక్ష్మి



వాగ్దేవి కళాశాలల సెక్రటరీ - కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కె.రామకోటేశ్వరరావు, ఒ.నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, ఎస్.సురేష్‌బాబు, పి.కృష్ణారావు, ఐ.క్రిష్ణకిషోర్ అభినందించారు.

ఘనంగా బాలల దినోత్సవం


వివేకాలో బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న బాలనటి మోక్ష

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యతో పాటు ఇతర కళల్లో కూడా రాణించాలని ప్రముఖ బాల సినీనటి మోక్ష అన్నారు. స్థానిక వివేకా విద్యాసంస్థల బాలల దినోత్సవ వేడుకలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏటా మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలను స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్లో ప్రారంభించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించిన తొలిరోజున వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ బాలనటి మోక్ష హాజరయ్యారు. గత పదేళ్లుగా సినిమాలు, టీవీ, ఓటీటీ సీరియల్స్‌లో నటిస్తున్న మోక్ష, ఇప్పటికి 19 అవార్డులను అందుకున్నారు. నటి మోక్ష మాట్లాడుతూ ఎందరో నటీనటులు ఆవిర్భవించిన తెనాలికి రావటం సంతోషంగా ఉందన్నారు. సినిమాల్లోని డైలాగులతో నర్తించి చిన్నారులను ఆనందింపజేశారు


వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుక

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

బాల దినోత్సవం పురస్కరించుకొని ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల వ్యాసరచన పోటీలను ఉపాధ్యాయుల నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, శ్రీదేవి, రామచంద్ర రెడ్డి, డివి రమణమ్మ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా


మున్సిపల్ హైస్కూల్లో నృత్యప్రదర్శనలో విద్యార్థినులు

విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదనందిపాడు : జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు గురువారం పెదనందిపాడు లోని లయన్స్ మాంటిస్సోరి హై స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు బాల బాలికలు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ముద్దన నగరాజకుమారి, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, నర్రా బాలకష్ణ, అతిథులు గోనుగుంట్ల శ్రీధర్, గోనుగుంట్ల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


నారాకోడూరు పాఠశాలలో బాలల దినోత్సవంలో విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు : నారాకోడూరు జడ్‌పిహెచ్ స్కూలులో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహి ంచడం జరిగింది. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిచారు. జిల్లా స్థాయిలో , పాఠశాల స్థాయిలో వివిధ పోటీల్లో విజేతలకు చుండూరు భాస్కర్ రావు సహకారంతో విద్యార్థులకు బహుమతులు పాఠశాల ఛైర్మన్ వి నాగేశ్వరరావు అందజేశారు.



ప్రజాశక్తి - కొల్లిపర : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు టి మల్లేశ్వరావు అన్నారు గురువారం కొల్లిపర మండలంలోని అన్నవరపు లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గురువింద పల్లి శేఖర్ ప్రసంగించారు. విజేతలకు చుండూరు భాస్కరరావు సహకారంతో బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గ్రంధాలయాలలో గురువారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు హెచ్ ఎం, ఉపాధ్యాయుల పాత్రలను పోషించారు. తరగతి గదుల్లో పాఠాలు బోధించారు.పాఠశాల అసెంబ్లీ నిర్వహించారు. హెచ్ ఎం పాత్రను పోషించిన 10వ తరగతి విద్యార్థిని షేక్ అస్మా అసెంబ్లీలో సందేశం ఇచ్చి జాతీయ జెండాను ఎగరవేశారు. విద్యార్థులకు నిర్వహి ంచిన ఆటల పోటీలో విజేతలకు బహుమతులు పాఠశాల యాజమాన్యం కమిటి చైర్మన్ నేలపాటి విజయ తదితరులు అందజేశారు.



ప్రజాశక్తి - తాడికొండ: తాడికొండ నవంబర్ 14 బాలల స్నేహ సమాజం నిర్మించడం మన అందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ సమతా వాణి అన్నారు.బాలల దినోత్సవ సందర్భంగా చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని,రావెల,పొన్నెకల్లు, గరికపాడు, దామరపల్లి, బేజాత్ పురం, ఫణిదరం, లచ్చన్నగుడిపూడి గ్రామాలలో బాలల దినోత్సవం సదస్సు నిర్వహించారు. అనంతరం గోడ ప్రతిని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి. వెంకట్ సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, ఎండి జరీనా, మురళీధర్,సచివాలయం సిబ్బంది, అంగన్వాడి వర్కర్లు, హెల్త్ వర్కర్స్, క్రాఫ్ సిబ్బంది జయరాజు బ్యులా మరియు బాలబాలికలు పాల్గొన్నారు.

పిల్లల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించాలి : డిఇఒ రేణుక

జిల్లాలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


మాట్లాడుతున్న డిఇఒ రేణుక

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థులు సెల్ ఫోన్లకు అలవాటుపడి పుస్తకాలు చదవడం మానివేశారని, పుస్తక పఠనం ద్వారా పిల్లలలో విజ్ఞానం పెరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సీ.వీ.రేణుక అన్నారు. గురువారం స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను డిఈఓ రేణుక, జిల్లా గ్రంథాలసంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ , జిల్లా పంచాయితీ అధికారి బి.వి.నాగసాయికుమార్ , కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టరు , గుళ్ళపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావులతో కలిసి ప్రారంభించారు. డిఇఒ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో మొబైల్ లేకుండా జీవించడం లేదని, పిల్లలు మొబైల్‌కు బానిస కాకుండా చూడాలని, దాని వల్ల పిల్లల జ్ఞాపకశక్తి దెబ్బతింటుందని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బ రత్నమ్మ మాట్లాడుతూ గ్రంధాలయాలు ఆధునిక దేవాలయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 శాఖ గ్రంధాలయాలు , 32 గ్రామీణ గ్రంధాలయాలు , 103 పుస్తక పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయంలో 51 వేల పుస్తకాలు ప్రజలకు అందుబాటులో వున్నాయన్నారు. డిపిఒ నాగసాయి కుమార్ మాట్లాడుతూ సమాజంలో అభివద్ధి చెందాలంటే జ్ఞానాన్ని సంపాదించాలని, జ్ఞానం సంపాదిం చడానికి పుస్తకాలు చదవాలని , పుస్తకాలు కావాలంటే గ్రంధాలయాలకు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా గుళ్ళపల్లి సేవాసంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావు పది వేల రూపాయాలు విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంధాలయానికి అందించారు. కార్యక్రమంలో ఉప గ్రంధ పాలకులు కె. ఝాన్సీలక్ష్మీ , యాంకర్ సుజాత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : యువత విద్యార్థి దశనుంచే గ్రంథ పఠనం అలవర్చుకోవాలని తెనాలి మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ అదేశాలమేరకు తెనాలి గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంల జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆలపాటి కళాపీఠం అధ్యక్షులు అయినాల మల్లేశ్వర రావు, విశ్రాంత ఉపాధ్యాయులు రాయపాటి శివ నాగేశ్వర రావు, డివిఆర్ ప్రసాద్ తదితరులు జవహర్ లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయం లో, గ్రంథాలయ వారోత్సవాలను మాజీ ఎంపీపీ ముద్దన నగరాజ కుమారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత గ్రంథాలయం ఎదురు ఉన్న గాంధీ, నెహ్రూ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : గ్రంధాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు గురువారం ర్యాలీ జరిపారు. అనంతరం గ్రంధాల యంలో జెడ్పి హైస్కూల్ ఉపాధ్యాయులు కన్నబాబు, రిటైర్డ్ టీచర్ జమ్ముల వీరాస్వామి, టి గిరిధర్ కుమార్, జవహర్ లాల్ నెహ్రు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - మంగళగిరి : గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా, బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరి శాఖా గ్రంధాలయంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్ బాబు మాట్లాడారు. డి ఎస్ కార్యక్రమంలో శర్మ, గ్రంధాలయ శాఖ అధికారిని ఎన్ ఆరోగ్యం, రికార్డ్ అసిస్టెంట్ పి కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : గ్రంథాలయాలు విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలని తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.ఎన్.రెడ్డి దారి రెడ్డి చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలో ఉన్న జిల్లా శాఖ గ్రంధాలయంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.అనంతరం జూనియర్ విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీ లు నిర్వహించారు. జిల్లా పరిషత్ హై స్కూల్, భగవాన్ హై స్కూల్, రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు రమేష్, శారద, జోత్స్న, శ్రీవల్లి, గ్రంథాలయ అధికారి ఎస్కె నాగూర్ భాష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు, సిఐటియు కార్యకర్త ఎస్ కే దస్తగి రి (58) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. భవననిర్మాణ కార్మిక సంఘంలో దస్తగిరి చురుగ్గా పని చేశారని సిపిఎం పట్టణ కార్యదర్శ వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ రావు, సిహెచ్ భుజంగరావు, మారిన నాగేశ్వరరావు, ఎస్ కే భాష, బొబ్బిలి రామారావు, ఎల్ సత్యం మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మామిళ్ళపల్లి సర్పంచ్ యానాదిరావు హఠాన్మరణం

ప్రజాశక్తి - పొన్నూరు

మామిళ్ళపల్లి గ్రామ సర్పంచ్ గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. గ్రామంలో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ ప్రజలు సర్పంచి ఆకస్మిక మరణంతో భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పొన్నూరు నియోజకవర్గం వైసిపి ఇన్చార్జి అంబటి మురళీకృష్ణ సర్పంచ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యానాదిరావ్ కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు.

17న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 41వ వార్షికోత్సవ సందర్భంగా 17వ తేదీన ఉదయం 10 గంటలకు తెనాలి రోడ్డులో గల మార్కండేయ కళ్యాణ మండపంలో చేనేత పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని సొసైటీ కార్యదర్శి పి రాజశేఖర్ గురువారం తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బిటెక్, ఎంబిబిఎస్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

షుగర్ వ్యాధి గురించి తెలుసుకుందాం..

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రతి ఇంటి తలుపు తట్టి షుగర్ వ్యాధి, క్యాన్సర్ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన వైద్యాధికారి కె విజయలక్ష్మి ఆరోగ్య సిబ్బందికి పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం., ఎన్ సి డి సి పి 3.0 ఆమె ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి పైన పేర్కొన్న వ్యాధులపై అవగాహన కల్పించడానికి ఈ వారోత్సవాలను వినియోగించుకొని, ఎన్నింటికి వెళ్లాలని సిబ్బందిని కోరారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించడంతో పాటు, అనుమానితులను గుర్తించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని చెప్పారు. ఆహారంలో కొన్ని మార్పులు చేసుకొని సహజంగా దొరికే పండ్లు, ఆకుకూరలు, పచ్చి కూరగాయలు తీసుకోవడం ద్వారా షుగర్ వ్యాధిని దూరంగా పెట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ పి శాంతకుమారి, డాక్టర్ ఎం అనూష ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని గురువారం హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో రోగులకు మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజు 30 నిమిషాలు వ్యాయామం చేస్తాం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటాం అంటూ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష రోగులుచే ప్రతిజ్ఞ చేయించారు. రోగులకు షుగర్ వ్యాధితో పాటు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించే కరపత్రాలను అందజేశారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులకు నీరసం, బరువు తగ్గడం, అరికాళ్ల మంటలు, రాత్రి సమయంలో ఎక్కువగా మూత్ర విసర్జన చేయుట, కంటి చూపు మందగించడం, గాయాలు మానకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అన్నం తక్కువ తీసుకొని కూరలు ఎక్కువ తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో చపాతి, జొన్న రొట్టె, గోధుమ రవ్వతో చేసిన పదార్థాలను తీసుకుంటే షుగర్ కంట్రోల్ లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సుమంత్, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడ్రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో పైప్‌లైన్ల మరమ్మతుల పనుల వల్ల శుక్ర, శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ నుండి హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరిగే 800 ఎంఎం డయా పైప్‌లైన్‌పై సంజీవయ్య నగర్ రైల్వేగేటు వద్ద ఏర్పడిన లీకుల మరమ్మతుల పనులు శుక్రవారం మధ్యాహ్నం నుండి చేపట్టనున్నట్లు చెప్పారు. పనుల వలన లక్ష్మీపురం, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, ఏఎంసి, హౌసింగ్ బోర్డ్, కోర్ట్ కాంపౌండ్, కెవిపి కాలనీ, వికాస్ నగర్, శ్యామలానగర్, హనుమయ్య నగర్, నెహ్రు నగర్, రాజీవ్ గాంధి నగర్, బొంగరాల బీడు, వసంతరాయపురం, శారదా కాలనీ రిజర్వాయర్ల పరిధిలో శుక్రవారం సాయంత్రం, శనివారం రోజు పూర్తిగా నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుండి యధావిధిగా సరఫరా జరుగుతుందన్నారు. నగర ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని కోరారు.

విద్యుత్ రంగం - కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - సవాళ్లు అంశంపై

నేడు గుంటూరులో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగం - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు -సవాళ్ళు అనే అంశంపై నేడు గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం గుజ్జనగుండ్ల విద్యుత్‌స్టోర్ వద్ద సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సంస్కరణలు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. ఈ సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగారావు, రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఎలక్ట్రిసిటీ నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు ముజఫర్ అహ్మద్ తదితరులు

డి.సూరిబాబు, జె.రాజశేఖర్, పి సుదర్శన్ రెడ్డి, సిహెచ్ నాగ బ్రహ్మాచారి, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.పోస్టర్ ఆవిష్కరణలో యూనియన్ నాయకులు లక్ష్మణరావు, పవన్, రాంబాబు, విల్సన్ పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం



ప్రజాశక్తి -గుంటూరు

భాష్యం విద్యా సంస్థల్లో.. : భాష్యం మెయిన్ క్యాంపస్, పట్టాభిపురం, ఆర్టీసి కాలనీ, సాంబశివపేట, ఎస్‌విఎన్ కాలనీ, నగరాలు, భాష్యం బ్లూమ్స్, ఇతర క్యాంపస్‌లలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ ప్రథమ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి విద్యార్థులు నివాళి అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కన్న విద్యా సంస్థల్లో.. : స్థానిక రైలుపేటలోని కన్న విద్యా సంస్థల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బాలల దినోత్సవం నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ప్రజ్ఞ పాఠశాలలో..: స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో బాలల దినోత్సంలో పాఠశాల సెక్రెటరీ నాయుడు చక్రనాగ్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎసిఎంఇ స్కూల్లో.. : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పొత్తూరు ఎసిఎంఇ స్కూల్లో వార్షిక క్రీడాదినోత్సవం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్లు నందమూరి దీప్తి, నందమూరి సౌగంద్ ప్రసంగించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కెఎల్‌పి స్కూల్లో.. : స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేశారు. పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు



అందజేశారు.చిన్నారుల కోసం మ్యాజిక్‌షో, మిమిక్రీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ జోసఫ్‌లో.. : స్థానిక నగరంపాలెంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. సెయింట్ జోసఫ్స్ కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్ మ్యాథ్స్ ప్రొఫెసర్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ చంద్రథైనిస్, పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జయరత్నబాల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



అడవి తక్కెళ్లపాడు జెడ్పీ హైస్కూల్లో.. : అడవి తక్కెళ్లపాడు జెడ్పీ హైస్కూల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ప్రెసిడెంట్ లయన్ ముట్లూరి వెంకయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయశ్రీ, క్లబ్ మెంబర్ జి.మల్లిఖార్జునరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



గీతాంజలి హైస్కూల్లో.. : స్థానిక ఏటి అగ్రహారం, రామిరెడ్డి నగర్‌లో గీతాంజలి హైస్కూల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ షేక్ హుస్సేన్, విద్యార్థులతో కలిసి చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, సాంస్కృతికపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ షంషాద్‌భాను తదితరులు పాల్గొన్నారు.



సుమేధ హైస్కూల్లో.. : స్థానిక ఏటిగ్రహారంలోని ఎంఎన్‌ఆర్ కన్వెన్షన్‌లో సుమేధా హైస్కూల్ బాలోత్సవం-7 ఘనంగా నిర్వహించారు.స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గేమ్స్, స్పోర్ట్స్, లిటలరీ, కల్చరల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ నాజియాబేగం, అయ్యప్ప, డాక్టర్ శిరీష, ప్రొఫెసర్ వీర రాఘవరావు, స్కూల్ ప్రిన్సిపల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జైన్ హైస్కూల్లో.. : స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ ఆటలు, వ్యాసరచన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీవిద్య హైస్కూల్లో.. : స్థానిక సంతోషనగర్‌లోని శ్రీవిద్యహైస్కూల్‌లో బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేటర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు హాజరై ప్రసంగించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవిజేత హైస్కూల్లో : ఏటి అగ్రహారంలోని శ్రీవిజేత హైస్కూల్‌లో బాలల దినోత్సవంలో స్కూల్ డైరెక్టర్ సిహెచ్ శ్రీహరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థులకు పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.





ఎంవిఎస్ స్కూలులో చిన్నారులతో డాక్టర్ హరిత

ఎంవిఎస్ స్కూల్లో బాలల దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరిల్ స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.హరిత హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యాలను ఎంచుకొని, ఇష్టంగా చదవాలన్నారు. అప్పుడే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్.బారవి, ప్రిన్సిపాల్ ఎన్.తాండవకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.దివ్య, లైఫ్ స్కిల్స్ ప్రొఫెసర్ వ్.ఎస్.ఆర్ తదితరులు పాల్గొన్నారు.



నేటినుండి వివిఐటిలో బాలోత్సవాలు

20అంశాలు - 61 విభాగాల్లో పోటీలు

దేశ వ్యాప్తంగా 650 పాఠశాలల నుండి

హాజరుకానున్న 13 వేల మంది విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ తెలుగు బాలల పండుగ వివిఐటి బాలోత్సవం 2024 సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించేందుకు పెదకాకాని మండలం నంబూరులోని వివిఐటి కాలేజీ ప్రాంగణం సిద్ధమైంది. నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. 20 అంశాలు, 61 విబాగాల్లో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా 650 పాఠశాలల నుండి 13వేల మంది విద్యార్థులు ఇప్పటికే నమోదు చేసుకున్నారని బాలోత్సవ్ అధ్యక్షులు వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఇతర రాష్ట్రాలు, దూరప్రాంతాల నుండి వచ్చే వారి కోసం గుంటూరు విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి, బస్సుల ద్వారా ప్రాంగణానికి తరలిస్తామని విద్యాసాగర్ తెలిపారు. బలోత్సవంలో పాల్గొనే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. కళాశాలకు చెందిన స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 600 మంది ఎన్‌సిసి విద్యార్థులు బాలోత్సవ్‌కు విచ్చేసే వారికి తోడ్పాటు అందిస్తారన్నారు. 300 మంది ఎన్‌సిసి విద్యారులు రక్షణ, భద్రత కోసం కేటాయించామన్నారు. ప్రాథమిక చికిత్స కోసం పెదకాకాని ఆరోగ్య కేంద్రం, ఆస్టర్ రమేష్‌హా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం, అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు కమిటీ నిర్ణయంలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత వాటర్ బాటిల్‌ను తెచ్చుకోవాలని సూచించారు.